# నమ్మించి.. నట్టేట ముంచారు!

- జాతీయ సఫాయి కర్మచారీ పథకంలో కార్మికుల పేరిట వాహనాల కొనుగోలు
- వాయిదాలు చెల్లించని జీవీఎంసీ
- రూ.31లక్షలు చెల్లించాలని బ్యాంకర్ల ఒత్తిడి
- లేని పక్షంలో వాహనాలు జప్తు చేస్తామని నోటీసులు
- లబోదిబోమంటున్న కార్మికులు



సెప్టింగ్ ట్యాంకర్ వద్ద గ్రూపు సభ్యులు



అద్దె వాహనంపై జీవీఎంసీ పేరు

అగనంపూడి: పారిశుధ్య కార్మికులను ఆర్థికంగా ఆదుకోడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకానికి జీవీఎంసీ అధికారులు తూట్లు పొడుస్తున్నారు. జాతీయ సఫాయి కర్మచారీ పథకంలో ప్రభుత్వ ఉద్యోగులు కాని వారికి, గ్రూపులకు రాయితీపై పారిశుధ్య వాహనాలు ( సెప్టిక్ ట్యాంక్‌లు, జెట్టింగ్ యంత్రాలు, ప్రధాన కాలువల పూడిక తీత యంత్రాలు) అందిస్తుంది. ఈ పథకం ద్వారా జీవీఎంసీ అధికారులు 79, 85 వార్డులోని పది మంది పారిశుధ్య కార్మికులను రెండు గ్రూపులుగా విభజించి వారి పేరుతో డిసెంబర్ 2022లో సెప్టిక్ ట్యాంక్, జెట్టింగ్ యంత్రాన్ని కొనుగోలు చేయించారు. బ్యాంక్ రుణం చెల్లించే బాధ్యత తమదే అంటూ జీవీఎంసీ ఏడేళ్లపాటు వాహనాలను అద్దెకు తీసుకుంది. అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు కానేటి చిలకమ్మ, అప్పారావు, గుర్రాల దివ్య, సత్రబోయిన మంగ, కానేటి నాగమణిల పేరుతో జెట్టింగ్ యంత్రాన్ని కొనుగోలు చేసి జీవీఎంసీ అద్దెకు తీసుకుంది. ఈ వాహనంపై జీవీఎంసీ పేరు రాయించుకొని వాడుకుంటుంది. వాహనాన్ని కనీసం వాహనదారుల నుంచి అద్దెకు తీసుకున్నట్టు ఎక్కడా రాయించలేదు.

**రెండో గ్రూపుపేరుతో సెప్టిక్ ట్యాంకు**

అలాగే రెండో గ్రూపులో భీంపల్లి సత్యవతి, కనకరాజు, ఈరిగి పింకి, చిత్తా నాగమణి, మరుడుపాక కనక రాజుల పేరుతో సెప్టిక్ క్లీనింగ్ ట్యాంక్‌ను బ్యాంక్ ద్వారా కొనుగోలు చేసి వినియోగించుకుంటుంది. ఈ రెండు గ్రూపులతో జీవీఎంసీ అధికారులు ఒప్పందం కూడా చేసుకున్నారు. వాహనాలు వినియోగించుకున్నందుకుగానూ ఒక్కో వాహనానికి నెలకు రూ.90వేలు అద్దె చెల్లించడానికి ఆమోదిస్తూ జీవీఎంసీ కమిషనర్, ప్రజారోగ్యశాఖ చీఫ్ మెడికల్ ఆఫీసర్, జోనల్ కమిషనర్‌తోపాటు ఇతర అధికారులు వీరితో ఒప్పందాలు చేసుకున్నారు.

బ్యాంకర్ ఇచ్చిన రుణం మొత్తం 31,25,000 పావలా వడ్డీతో చెల్లించడానికి అంగీకరించారు. నెలకు వాయిదాగా రూ.53వేలు చెల్లించాలని బ్యాంకర్ షరతు విధించింది. వీటన్నింటికీ హామీదారుగా ఉంటూ, రెండు గ్రూపులతో ఒప్పందం చేసుకొని నయా పైసా కూడా వీరి ఖాతాలో సొమ్ములు జమ కాకపోవడం తోప దిమందికార్మికులకు కూర్మన్నపాలెం కెనరా బ్యాంక్ నుంచి నోటీసులు పంపించారు.

**బకాయిలు చెల్లించకపోతే జప్తు**

గత ఆగస్టు నాటికి రూ.31,95,000 చెల్లించాలని లేని పక్షంలో వాహనం జప్తు చేస్తామని నోటీసులు జారీ చేయడంతో అప్పటి జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు విన్నవించుకోవడంతో ఆయన ఆగ్రహించి తక్షణమే బిల్లులు మంజూరు చేయాలని ఆదేశించారు. అయితే సెప్టిక్ ట్యాంకర్ వాహనదారులకు మాత్రమే ఇప్పటి 8 మాసాలు బిల్లులు ఒకసారి, నాలుగు మాసాల బిల్లులు మరోసారి చెల్లించారు. ఈ 12 నెలల వాయిదాల మొత్తాన్ని బ్యాంకు బకాయిల కింద జమచేసుకుంది. వీరి చేలతికి నయాపైసా కూడా చేరలేదు.

**జెట్టింగ్ యంత్రానికి రెండు నెలలు మాత్రమే**

ఇదిలా ఉంటే జెట్టింగ్ యంత్రం కొనుగోలు చేసిన బృందానికి మాత్రం కేవలం రెండు మాసాల బిల్లులు మాత్రమే చెల్లించారు. దీంతో బ్యాంకర్ రూ. 31,95,000 తక్షణం చెల్లించాలని లేని పక్షంలో వాహనాలు జప్తు చేస్తామని నోటీసులు జారీ చేయడంతోపాటు ఇళ్లకు వెళ్లి బెదిరించడంతో వాహనదారులు అప్పులు చేసి కొంత మొత్తాన్ని చెల్లించారు. వీరి గోడును గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు విన్నవించుకోగా, ఆయన జీవీఎంసీ కమిషనర్‌కు లేఖ ద్వారా బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అయినా జీవీఎంసీ అధికారులు లెక్క చేయక పోవడంతో కార్మికులు లబోదిబో మంటున్నారు.




గ్రూపు సభ్యులతో జీవీఎంసీ అధికారులు చేసుకున్న ఒప్పంద పత్రం

### ఆత్మహత్యలే శరణ్యం...



ఒప్పంద కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న మాకు ఆశ కల్పించారు. చాలీ చాలని జీతానికి తోడుగా నెలకు ఐదు నుంచి ఆరు వేలు మిగులుతుందని భావించి జీవీఎంసీ అధికారులను నమ్మి మోస పోయాం. బ్యాంక్ నుంచి రోజూ ఒత్తిళ్లు వస్తున్నాయి. కేవలం రెండు మాసాల బిల్లులు అధికారులు బ్యాంక్‌లో జమ చేశారు. నేటికి 34 నెలల నుంచి బ్యాంక్ వాయిదాలు చెల్లించకపోవడంతో బ్యాంక్ పూర్తి మొత్తం చెల్లించకపోతే వాహనం జప్తు చేయడంతోపాటు కేసు బనాయిస్తామని బెదిరిస్తుండడంతో ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటున్నాం.

– కానేటి చిలకమ్మ, జెట్టింగ్ యంత్రం యజమాని

### అధికారులే మోసం చేస్తే...



మాకు అండగా ఉండాల్సిన అధికారులు ఇలా నమ్మించి నట్టేట ముంచారు. కనీసం బ్యాంక్‌కు వాయిదాలు చెల్లించినా ఒత్తిడి ఉండేది కాదు. జీవీఎంసీ ఒప్పందాన్ని ఉల్లంఘించి మోసం చేస్తే మా గోడు ఎవరికి చెప్పుకొనేది. ఎమ్మెల్యే సిఫార్స్‌ను కూడా లేక్కచేయని స్థితికి అధికారులు వచ్చారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతుంది.

-కన్నేటి నాగమణి , పారిశుధ్య కార్మికురాలు

### మేయర్, కమిషనర్ కలుగజేసుకోవాలి



మాకు బకాయిపడిన మొత్తాన్ని చెల్లించేలా జీవీఎంసీ మేయర్, కమిషనర్ చొరవ తీసుకోవాలి. బకాయి చెల్లించే ఏర్పాటు చేయాలి. అప్పులు చేసి కొంత మొత్తం చెల్లించాం. వాటికి వడ్డీలు చెల్లించలేని పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాం. మా బాధను అర్థం చేసుకొని వెంటనే బకాయిలు చెల్లించి మమ్మల్ని ఆదుకోవాలి.

– సత్రబోయిన మంగ

## అధికారుల దృష్టికి ఉప్పరకాలనీ సమస్యలు



దేవన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉప్పరకాలనీ నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు బొర్రమాంబ ఉప్పర కాలనీలో సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి నక్కా రమణబాబు ఆధ్వర్యంలో కాలనీ వాసులు దేవన్‌రెడ్డిని కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా దేవన్‌రెడ్డి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి తనవంతు కృషి చేయడంతో పాటు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో కాలనీ సంఘ నాయకులు ఉబ్బ రాము, డి.మహేష్, వి.భాస్కరరావు, అనిల్, రాజబాబు, మణి తదితరులు పాల్గొన్నారు.

## వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు



వారాహి అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి తదితరులు

కూర్మన్నపాలెం: కణితి ఇ–సేవా మైదానంలో జరగుతున్న వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అత్యంత వైభవంగా హోమం నిర్వహించారు. ఉత్సవానికి మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వచ్చే నెల 5వ తేదీ వరకు నిర్వహించే ఈ ఉత్సవాలకు ప్రత్యేక విశిష్టత ఉందని పండితులు వెంకటవాసు, హరీష్‌శర్మ భక్తులకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇల్లపురాము, పి.వేణుబాబు, దుగ్గపుదానప్పలు, గోవిందరాజులు, దామోదర్, గుంట్లశ్రీను తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పార్టీ నేతలకు ఆత్మీయ సత్కారం



గుడివాడ అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న సంద్రాన నూకరాజు

గాజువాక: జీవీఎంసీ 68వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సంద్రాన నూకరాజు ఆ పార్టీ నాయకులకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. తనను పార్టీ వార్డు అధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతగా మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పార్టీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ సాయి అనూష, గుడివాడ లతీష్‌లను శాలువాలతో సత్కరించి పుష్ప గుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

### రామాలయ పునర్నిర్మాణానికి విరాళం



నగదు అందిస్తున్న ఉక్కు మాజీ అధికారి కొలిపాక అప్పారావు దంపతులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడకలోని రామాలయ పునర్నిర్మాణానికి ఉక్కు మాజీ అధికారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొలిపాక అప్పారావు, వరలక్ష్మి దంపతులు రూ.25,678 విరాళంగా ఆలయ కమిటీకి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనతోపాటు తమ సంఘమైన శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘం ప్రతినిధులు రూ.3లక్షల వరకు ఆలయ పునర్నిర్మాణానికి అందించామన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు విందుల సతీష్, చిరురాజు, దానబాల అప్పలనాయుడు, సూర్యారావు, ఎం.వరహాలు, విందుల రాము, గుదే అప్పరాజు, లక్ష్మణ్, రాజు, నరసింగరావు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ రాజారావు తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్‌నగర్ క్వారీ రోడ్డులోని సామాజిక భవనంలో గ్రామ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రాజారావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మాధవ్‌బాగ్ వైద్యశాల సహకారంతో నిర్వహించిన శిబిరానికి పెద్ద సంఖ్యలో రోగులు తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ కల్పన రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా వ్యాధులు ప్రబలుతున్నాయని, ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చదరం మురళీకృష్ణ, శీకు రమణ, పతివాడ జయకృష్ణ, పెంటకోట శంకరరావు, పొలిమేర రామసూరి, కొవ్వూరి మణి, యాతం రమేష్, దువ్వాడ చిన్నారావు పాల్గొన్నారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం



వినాయకుడికి పూజలు చేస్తున్న కోమటి శ్రీనివాస్ తదితరులు

కూర్మన్నపాలెం: స్థానిక సిద్ధార్థనగర్‌లో విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు కోమటి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన ఆలయ కమిటీ సభ్యులతో కలసి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో కోమటిరమాదేవి, ఆలయ కమిటీ సభ్యులు లోవరాజు, పడాల బసవరాజు, దానయ్య అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సేవలే శాశ్వతం



హరనాథ్‌ను సత్కరిస్తున్న ఇంటక్ అధ్యక్షుడు పైడా వెంకటరమణ



రమేష్‌ను సత్కరిస్తున్న డాక్టర్ ప్రసాదరావు, నాయకులు

అగనంపూడి: ఆస్తి, అంతస్తులు ముఖ్యం కాదని, మనిషి చేసిన సేవలే ఆ మనిషిని చరిత్ర పుటల్లో నిలుపుతాయని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రి విశ్రాంత చీఫ్ మెడికల్ ఆఫీసర్ నిమ్మకూరి ప్రసాద్ అన్నారు. ఎఫ్ఎస్ఎల్ఎన్ ఉద్యోగి నిమ్మకూరి రమేష్ ఉద్యోగ విరమణ సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రమేష్, భానుమతి దంపతులను 85వ వార్డులోని నిర్వాసితకాలనీలో ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు దామా సుబ్బారావు మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాల పాటు ఉద్యమ నాయకునిగా, వైఎస్సార్‌సీపీ నాయకునిగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన రమేష్ శేష జీవితం ప్రజా సేవలో గడపాలన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల హక్కు పరిరక్షణ కమిటీ కన్వీనర్ పట్టా రామ అప్పారావు, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర చైర్మన్ ఎలీసా, జిల్లా అధ్యక్షుడు పిట్ల రమణ, కడితి సాధు, అలమండ ప్రసాద్, విజయ్‌కుమార్, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

**ఇంటక్ నాయకునికి సత్కారం**

విశాఖ ఉక్కు ఉద్యోగి, ఇంటక్ నాయకుడు పెదిరెడ్ల హరనాథ్ ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా అగనంపూడి ఇంటక్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సీడబ్ల్యూసీలో ఘనంగా సత్కరించారు. ఇంటక్ అధ్యక్షుడు పైడా వెంకటరమణ ,అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు శీరంశెట్టి గోవిందరావు, మోటూరి వెంకటరమణ, మడుగల నరసింగరావు, పెదిరెడ్ల నీలకంఠం, పిల్లా శ్రీనివాసరావు, దాము రోతు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## దేవాంగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

గాజువాక: చదువుతోపాటు లక్ష్యాన్ని నిర్దేశించుకొని భావి భారత పౌరులుగా ఎదగాలని సీఎంఆర్ అధినేత మావూరి వెంకట రమణ అన్నారు. జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ఆయన అందజేశారు. గాజువాకలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు చదువు భారం కాకూడదనే ఉద్దేశంతో పురస్కారాల ద్వారా వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. దేవాంగుల సంక్షేమానికి ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ ఉప్పు సత్యనారాయణ, అధ్యక్షుడు బొమ్మన సత్యరాజ్ కుమార్, కార్యదర్శి చల్లా నాగేశ్వరరావు, ప్రతినిధులు మావూరి రామారావు, కాలెపు సదాశివ తదితరులు పాల్గొన్నారు.

## సమష్టిగా పనిచేద్దాం



శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న సిద్ధేశ్వరం యూత్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు

పెదగంట్యాడ: అంతా సమష్టిగా పని చేసి వార్డులో పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ 75వ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాస్‌రెడ్డి (బుజ్జి) అన్నారు. సిద్ధేశ్వరం యూత్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో తిప్పల గురునాథ్, మద్ది తాతారావు, గొందేశి కుంచయ్యరెడ్డి, పిట్టా రెడ్డి, గొందేశి నరసింహమూర్తి, తిప్పల అప్పారావు, శ్రీనివాస్‌రెడ్డి, దుక్క కన్నారావు, గొందేశి పైడిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాలర్ కేబిన్‌లో మంటలు



మంటలను అదుపు చేస్తున్న సెలెస్ట్ సిబ్బంది

గాజువాక: స్థానిక సెలెస్ట్ అపార్ట్‌మెంట్స్ వద్ద జాతీయ రహదారిపై వెళ్తున్న ఒక ట్రాలర్ ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. గంగవరం పోర్టు నుంచి విశాఖ పోర్టుకు వెళ్తున్న ట్రాలర్ సెలెస్ట్ వద్దకు చేరుకొనేసరికి ఇంజిన్‌లోనుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దీన్ని గమనించిన డ్రైవర్ వాహనాన్ని ఆపేసి కిందికి దిగిపోయాడు. విషయాన్ని వెంటనే పెదగంట్యాడ అగ్నిమాపక కేంద్రానికి తెలియజేశాడు. మంటలు వస్తున్న విషయాన్ని గమనించిన సెలెస్ట్ భద్రతా సిబ్బంది వెంటనే మంటలను ఆర్పివేశారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంపై అగ్నిమాపక సిబ్బంది ప్రాథమిక వివరాలను సేకరించారు.

## బాధితులకు దేవన్‌రెడ్డి పరామర్శ



కార్తీక్ రెడ్డిని పరామర్శిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: క్రికెట్ ఆడుతూ ఒకరినొకరు ఢీకొని తీవ్రంగా గాయపడిన పెదకోరాడకు చెందిన బసా కార్తీక్‌రెడ్డి, గొందేశి భరత్‌ను వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఆయన వెంట 75వ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, బొడ్డ గోవింద్, గొందేశి వెంకటరమణారెడ్డి, గొందేశి మధుసూదన్‌రెడ్డి, బసా పేర రెడ్డి, బస రమణ ఉన్నారు.

**రూ.33వేల ఆర్థిక సాయం**

నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998–99 టెన్త్ క్లాస్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్ ఆధ్వర్యంలో బసా రమణారెడ్డి కుమారుడు బసా కార్తీక్‌రెడ్డి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.33వేలు ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో శిరిశెట్టి వెంకట శివ అప్పారావు, పిట్టా పైడిరెడ్డి, కిలాని రవి తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానంపై అపోహలు వద్దు



రక్తదానం చేస్తున్న దాత

పెదగంట్యాడ: రక్తదానంపై అపోహలొద్దని 110 జేసీఐ ఇండియా జోన్–4 కమ్యూనిటీ డైరెక్టర్ బొత్స దిలీప్ కుమార్ అన్నారు. జేసీఐ ఇండియా 110 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 110 జేసీస్ బ్లడ్ డొనేషన్ డ్రైవ్‌లో భాగంగా పెదగంట్యాడలో ఆదివారం నిర్వహించిన శిబిరంలో పెద్ద సంఖ్యలో యువత రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు ఈ డ్రైవ్ ఉంటుందని తెలిపారు. రక్తదాతలు ముందుకు వచ్చి రక్తం దానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేవీ రావు, కిరణ్ పోలిపల్లి, ఎం.శ్రావణ్ కుమార్, కృష్ణ కొంకిపూడి, రామకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## స్ఫూర్తి ప్రదాతకు ఘన సత్కారం



రామకోటి మాతృమూర్తిని సత్కరిస్తున్న ప్రజా నాయకులు

అగనంపూడి: బ్రహ్మకుమారీస్ అగనంపూడి, లంకెలపాలెం శాఖల ఏర్పాటుకు పాటుపడిన నాగులాపల్లి పల్లమ్మను ప్రజా సంఘాలు, బ్రహ్మకుమారీస్ జిల్లా కమిటీ ఘనంగా సత్కరించింది. అగనంపూడిలోని బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అగనంపూడి ఇన్‌చార్జ్ మీకే రామకోటి మాట్లాడుతూ తన తల్లిదండ్రులు నాగులాపల్లి అప్పారావు, పల్లమ్మకు పదిమంది కుమారులు, ఆరుగురు కుమార్తెలు జన్మనివ్వడమే కాకుండా వారందర్నీ సన్మార్గంలో నడిపించిన పుణ్య మూర్తికి జన్మదినోత్సవం జరుపుకొనే అవకాశం దక్కడం సంతోషంగా ఉందన్నారు. 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, 85వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జి.పూర్ణానందశర్మ (పూర్ణ) మాట్లాడుతూ 16 మంది సంతానంతో ఉమ్మడి కుటుంబాన్ని నడిపించిన మహాశక్తిమూర్తి పల్లమ్మను ఈనాటి తరం పిల్లలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ మౌంట్ అబూ ప్రతినిధి దిల్‌రాజు భాయిజీ , బ్రహ్మకుమారీస్ జిల్లా కోఆర్డినేటర్ సోమేశ్వరి అక్కయ్య, వేణి అక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

## పనితీరుతో గుర్తింపు



గాజువాక: కష్టపడి పని చేస్తే ఎప్పుడూ గుర్తింపు లభిస్తుందని 69వ వార్డు గ్రామ పెద్దలు అన్నారు. 69వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా నియమితులైన బోగాది సన్యాసిరావు (సన్నీ)ను ఆ వార్డుకు చెందిన పలు గ్రామ పెద్దలు ఆదివారం సత్కరించారు. పార్టీ ఆవిర్భావం నుంచి వార్డు అధ్యక్షుడిగా ఆయన అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఆయన ఉన్నత పదవులను అలంకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామాల పెద్దలు అప్పలరెడ్డి, రాము, దుర్గారెడ్డి, బాబూరావు, వెంకటరావు, అప్పలరాజు పాల్గొన్నారు.

## వేద పాఠశాలకు సరకుల వితరణ

అగనంపూడి: స్థానిక బొర్రమాంబ పారాయణ సేవా సమితి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా నంగినారపాడు సమీపంలోని సప్త రుషి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేద పాఠశాలకు ఆదివారం పప్పు దినుసులు, గోధుమ పిండి, నూనె అందించారు.